క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం

కారంపూడి: కారెంపూడి గ్రామ ఉప సర్పంచ్ సూరె అంకారావు స్థానిక మాచర్ల రోడ్డు పక్కన నిర్మించిన పద్మావతి శ్రీనివాస కన్వెన్షన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతోపాటు పద్మావతి శ్రీనివాసుని కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే స్వామి కల్యాణంలో పాల్గొని వేదపండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కేని ఉప సర్పంచ్ అంకారావు, ఆయన కుమారుడు అరుణ్‌కుమార్ తదితరులు వెండి కిరీటంతో సన్మానించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

గురజాల : స్థానిక కోర్టు భవనాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి జి.వెంకటేశ్వర్లు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుందని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.లాలా వెంకట శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జి ఎ.మంజులతా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ హరిబాబు, డీఈ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

మహిళల రాస్తారోకో

దాచేపల్లి: అద్దంకి–నార్కెట్‌పల్లి హైవేపై మహిళలు శుక్రవారం రాత్రి ధర్నా చేపట్టారు. దాచేపల్లికి చెందిన బుర్రి వెంకటనర్సమ్మ అనే మహిళ చీటిపాటల డబ్బు కాజేసిందని, సుమారు రూ. 2 కోట్లు డబ్బులు ఇవ్వలేదని మహిళలు మండిపడ్డారు. తమ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ హైవేపై రాస్తారోకో చేశారు. సీఐ బిలాలుద్దీన్ ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు ఒప్పిచర్లకు ప్రభుత్వ విప్ పీఆర్కే

కారంపూడి: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం ఒప్పిచర్ల గ్రామానికి విచ్చేస్తున్నట్లు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య గ్రామ పార్టీ నాయకులు తెలిపారు. గ్రామంలో జరుగుతున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభిస్తారని, ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

దుర్గి ఎస్‌ఐగా సతీష్ బాధ్యతల స్వీకరణ

దుర్గి: ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు దుర్గి పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం నాదెండ్ల మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై దుర్గి ఎస్‌ఐగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్‌ఐగా పనిచేస్తున్న టి. వెంకటరమణ సెలవుపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.


ఎస్‌ఐ సతీష్

గ్రామాల్లో నడక కార్యక్రమం

విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని ఏకోనాంపేట, నారాయణరెడ్డిపురం గ్రామాలలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి గబ్బునాయక్ గ్రామ నడక కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో తాగునీరు, పారిశుద్ధ్యంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఏకోనాంపేట పంచాయతీ కార్యాలయాన్ని, కొత్తూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోటేశ్వరావు, ఎంఈఓ వేముల నాగయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

నరసరావుపేట రూరల్: మొక్కజొన్నలో పేనుబంక నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. జొన్నలగడ్డ గ్రామంలోని మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించి పేనుబంక అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు, థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఫిలిప్ పాల్గొన్నారు.

మొక్కజొన్న ఆశాజనకం

శావల్యాపురం : మండలంలో పోట్లూరు, గుంటుపాలెం,వేల్పూరు,వయ్యకల్లు,మతుకుమల్లి, శావల్యాపురం తదితర గ్రామాల్లో అన్నదాతలు సాగు చేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- అడిగొప్పలలో గడప గడపకు మన ప్రభుత్వం


అడిగొప్పలలో మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కొనసాగుతున్నాయని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం అడిగొప్పల గ్రామంలో ఆరో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో గడప గడప కార్యక్రమం 114వ రోజుకు చేరిన సందర్భంగా పీఆర్కేకు స్థానిక మహిళలు గుమ్మడి కాయతో దిష్టి తీసి హారతులు ఇచ్చారు. అనంతరం పీఆర్కే ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. మూడున్నరేళ్లలో ప్రతి గడపా పొందిన సంక్షేమ లబ్ధి గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత సమర్థంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయన్నారు. సీఎం జగన్ ప్రధానంగా విద్య, వైద్య రంగాలను సంస్కరించారని, పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని, ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని పీఆర్కే కొనియాడారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి కృషి చేశామన్నారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు కాకర్ల రవి కుటుంబం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరింది. మొత్తం 374 కుటుంబాలను పీఆర్కే కలిశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఊరిబండి ఏగయ్య, మండల అధికారులు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, నాయకులు నల్లబోతు వెంకటేశ్వర్లు, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, నాలి శ్రీను, జంగా యలమంద కొనకంచి బాలు, సంక్రాంతి గురువులు, నాగెండ్ల లక్ష్మీనారాయణ, గర్ని లక్ష్మీనారాయణ, సంక్రాంతి సీతయ్య, కటకం చిన్న వెంకటయ్య, తోట వాసు, డాక్టర్ వెంకయ్య, జక్కా రమేష్, గుండాల వెంకటరామయ్య, శెట్టిపల్లి కోటేశ్వరరావు, మాచర్ల జార్జి, షేక్ జానీ, సి.హెచ్.రెడ్డి, మల్లెతోట జానీ, సచివాలయ కన్వీనర్లు వేముల సత్యనారాయణ, మాదాసు వెంకటేశ్వర్లు, కల్లూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే జీవితంలో ముందడుగు


పిడుగురాళ్ల ఎస్సీ బాలుర హాస్టల్లో భోజనం చేస్తున్న ఆంజనేయులు

పిడుగురాళ్ల: విద్యతోనే జీవితంలో ముందడుగు పడుతుందని మైక్రో ఇరిగేషన్ పీడీ, పిడుగురాళ్ల మండల ప్రత్యేకాధికారి సీహెచ్ ఆంజనేయులు చెప్పారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను గురువారం రాత్రి ఆయన సందర్శించారు. ముందుగా హాస్టల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం హాస్టల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయాన్నే గ్రామ నడక కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని డపింగ్ యార్డును సందర్శించి అక్కడ ఉన్న క్లాప్ మిత్రలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాశయ్య, తహసీల్దార్ చక్రవర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పట్టణ ఎస్‌ఐ పవన్ కుమార్ కథనం ప్రకారం.. నకరికల్లుకు చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు(54) నకరికల్లు నుంచి దాచేపల్లిలోని తమ బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో పిడుగురాళ్ల ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో అతని తలకు బలమైన గాయమైంది. పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వెంకటేశ్వర్లును పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రతమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మృతుడి తల్లి బెల్లంకొండ సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేణుగోపాలుని కల్యాణోత్సవ వైభవం


రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి


ప్రత్యేక అలంకారంలో శివపార్వతులు

మిట్టగుడిపాడు(రెంటచింతల): మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి 18వ వార్షిక కల్యాణం, శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల అర్చకులు వడ్డమాను రమణాచార్యులు, వెల్లటూరి నాగేశ్వరశర్మల నేతృత్వంలో పలువురు వేదపండితులు వేకువజామునుంచి పలు పూజా కార్యక్రమాలను, అభిషేకాలను చేశారు. దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన ఈ వార్షిక కల్యాణ మహోత్సవంలో పూరిమెట్ల శేషభాట్టాచార్యులు, అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివార్లకు కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దివ్యోత్సవాలను కనులారా వీక్షించి పులకించారు. స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాలుగు ప్రభలను ఏర్పాటు చేశారు. ఈఓ గాదె రామిరెడ్డి, ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ సయ్యద్ షమీర్‌బాషు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

అధికారుల పల్లెబాట


ఇనుపరాజుపల్లెలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్

కారంపూడి: మండలంలోని ఇనుపరాజుపల్లె గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర అనంతరం శుక్రవారం ఉదయం మండల ప్రత్యేక అధికారి జోసెఫ్‌కుమార్ గ్రామంలో వీధులన్నీ కలియతిరిగి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులతో కలిసి గ్రామంలో ప్రతి వీధిని కలియతిరిగి అక్కడ ప్రజలు చెప్పిన సమస్యలను విన్నారు. పొలం వెళ్లే బాటలనూ అధికారులు పరిశీలించారు. డ్రెయినేజీ, రోడ్ల సమస్యలను ప్రజలు అధికారుల ముందు ఉంచారు.

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వండి


పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గురజాల : రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపి వాటికి ప్రాధాన్యమివ్వాలని జిల్లా వనరుల కేంద్రం డీఆర్సీ నుంచి డీడీఏ ఎం.శివకుమారి, లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ వై.పుష్పరాణి సూచించారు. మాడుగుల శివారు అంజనాపురంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యాన్ని వివరించి వాటిలోని పోషకాల గురించి అవగాహన కల్పించి చిరుధాన్యాల సాగు చేసేలా చూడాలన్నారు. పంట మార్పిడి విధానంలో అపరాల సాగు గురించి రైతులకు తెలియచేశారు. వరి, మొక్కజొన్న, మిరప పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి, డీఆర్సీ ఏఓ ప్రవీణ్, వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి


బేడబుడ్గ జంగం కాలనీలో పరిసరాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

గురజాల : పరిసరాల పరిశుభ్రతకు, ఆరోగ్య రక్షణకు ప్రతిఒక్కరూ డ్రైడేను పాటించాలని తద్వారా దోమల నియంత్రణ సాధ్యమవుతుందని గురజాల మలేరియా సబ్ యూనిట్ అధికారి అంకమ్మరావు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని బేడ బుడ్గ జంగం కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. కీటక నియంత్రణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. మలేరియా నివారణలో భాగంగా ప్రజలు దోమల తెరలు వాడాలన్నారు. కిటీకీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలన్నారు. ఇంటి లోపల, బయట నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఒకసారి ఖాళీ చేసి తిరిగి మళ్లీ నింపుకోవాలన్నారు. ఫీవర్స్ ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సీతరామిరెడ్డి , సచివాలయం ఏఎన్‌ఎం లక్ష్మీ ఆశా కార్యకర్త సీతా, అమర లక్ష్మీ, కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు


చికిత్స అందిస్తున్న 108 వైద్య సిబ్బంది

బొల్లాపల్లి: కూలీలు ప్రయాణిస్తున్న మినీ వ్యాన్ పక్కకు వాలండంతో అందులో ఉన్న కూలీలు కింద పడి గాయపడిన ఘటన బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. కారంపూడి నుంచి 108 అంబులెన్సులు తరలివెళ్లి గాయపడిన పడిన వారికి అక్కడే ప్రథమ చికిత్స అందించారు. బీపీ, ఇతర వ్యాధులు ఉన్న నలుగురిని కారంపూడి పీహెచ్‌సీకి చేర్చారు. ప్రస్తుతం అందరూ క్షేమంగానే ఉన్నారు. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి వ్యాన్ పక్కకు వాలినట్లు తెలుస్తోంది. ఆటో పక్కకు వాలడంతో అందులో ఉన్న కూలీలంతా రోడ్డు పక్క రాళ్లపై పడ్డారు. అదే ఆటో పల్టీకొట్టి ఉంటే ప్రాణాపాయం జరిగేదని 108 సిబ్బంది తెలిపారు. కూలీలు దుర్గి మండలం అడిగొప్పల నుంచి బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు మిర్చి కోతలకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి చేరుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వ్యానులో మొత్తం 35 మంది ఉండగా అందులో 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అడిగొప్పల నుంచి బంధువులు వచ్చి అందరినీ ఇళ్లకు తీసుకువెళ్లారు.

రైతులకు అండగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

దాచేపల్లి: రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అండగా ఉండాలని ఎంపీపీ కటకటం జయశ్రీ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. రైతుల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులకు అందించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఏఓ కుమారి, కమిటీ సభ్యులు షేక్ జాకీర్ హుస్సేన్, హనుమంతరావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన


హైస్కూల్‌కు కేటాయించిన స్థలం గురించి మాట్లాడుతూ ఆర్డీఓ అద్దెయ్య

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో హైస్కూల్‌కు కేటాయించిన భూములను ఆర్డీఓ అద్దెయ్య శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసింది. భవనాలను నిర్మించేందుకు కావాల్సిన స్థలాన్ని అధికారులు గుర్తించారు. రెవెన్యూ అధికారులు గుర్తించిన స్థలాన్ని ఆర్డీఓ పరిశీలించి రెవెన్యూ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో ఆర్డీఓ సమీక్ష జరిపారు. ఆర్డీఓ వెంట జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, తహసీల్దారు మేరి కనకం, డీడీఓ మహాలక్ష్మి, సర్పంచ్ జంగా కృష్ణ, వీఆర్వో రమేష్ ఉన్నారు.

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి


కేశానుపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీడీవో మహాలక్ష్మి

దాచేపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మి చెప్పారు. మండలంలోని కేశానుపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఉపాధ్యాయులు అందిస్తున్న విద్యావిధానం గురించి అడిగి తెలుసుకున్నారు. డీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలన్నారు. కేజీబీవీలో చదివే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేజీబీవీలో ఆమె బస చేశారు.

పట్లవీడులో పల్లెనిద్ర

వెల్దుర్తి: మండల ప్రత్యేకాధికారి ఏడీఏ జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పట్లవీడులో గురువారం రాత్రి మండల స్థాయి అధికారులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోనే పల్లెనిద్ర చేశారు. శుక్రవారం ఉదయం గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, ఎంపీడీఓ డి ప్రసాద్, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ అల్లి సురేష్, డీటీ బ్రహ్మయ్య, ఈఓపిఆర్‌డి జవహర్‌లాల్ నెహ్రూ, ఏఈలు శ్రీనివాసరెడ్డి, బాబునాయక్, వీఆర్‌ఓ యలమంద, వెలుగు సీసీ బంగారయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు తాడికొండ పుల్లారెడ్డి, కోనుగుంట శ్రీనివాసరెడ్డి, చల్లా శ్రీనివాసరావు, అంజి, గుండెబోయిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

సత్తెనపల్లి: గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలు లేకుండా చూడాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ నాగ వెంకటలక్ష్మి చెప్పారు. శుక్రవారం సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల మొత్తం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వంటశాలలను తనిఖీచేశారు. ప్రిన్సిపల్‌కి, సిబ్బందికి సూచనలు చేశారు. వంటశాలలో దుర్వాసన వస్తోందని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. తరగతి గదుల దగ్గరలోనూ దుర్గంధం వస్తోందని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌పై దృష్టిపెట్టాలని, దానిని ఎప్పుడు శుభ్రం చేశారనే విషయాలను ఓ పుస్తకం పెట్టి నమోదు చేయాలని చెప్పారు. తాను మళ్ళీ పాఠశాలకు వస్తానని, అప్పుడు ఈ లోపాలు కనిపించకూడదని ఆదేశించారు.

నీటి నమూనాల సేకరణ

గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం రెండో విడత నీటి నమూనాలను అధికారులు సేకరించారు. ఇటీవల గురుకులంలో వినియోగించే నీటిలో ఈకోలి బ్యాక్టీరియా చేరడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురుకులంలో నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులు చేశారు. చెరువు నీటి వాడకాన్ని నిలిపివేశారు. వంటకు బోర్ వాటర్ వినియోగిస్తున్నారు. ఇప్పటికే 380 మంది విద్యార్థినులు గురుకులానికి చేరుకోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్‌ఓ ప్లాంట్ ఇన్, అవుట్ సైడ్, డార్మెటరీ, హ్యాండ్ వాష్ ఏరియాల నుంచి రెండో సారి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓలు వెంకట్రావు, ఖదీర్, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు తీర్మానం

వ్యవసాయ మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు సమావేశ మందిరంలో మార్కెట్ యార్డు జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ పి.ఎం. గోవిందరెడ్డి 2022 మార్కెట్ యార్డు ఆదాయ వ్యయాలను సభ్యులకు తెలియజేశారు. అనంతరం యార్డు చైర్మన్ బత్తుల మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో రైతులకు అన్నివిధాలా మెరుగైన వసతి సౌకర్యాలు అందిస్తామన్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం, మిరప, కందులు నిల్వ చేసుకునేందుకు సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. అవకాశం ఉన్న రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. అలాగే మార్కెట్ యార్డు నిధులతో వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలో రూ.కోటితో రైతు బజారు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం చైర్మన్ బత్తుల, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావులను మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీలు జయశ్రీ వెంకట రామిరెడ్డి, జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్యలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురప్పనాయుడుపాలెం సొసైటీ అధ్యక్షులు పారా వెంకటేశ్వర్లు, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, డైరెక్టర్లు రొడ్డా పుల్లారెడ్డి, ఏలూరి రాంబాబు, మక్కెన వెంకటసుబ్బారావు, సింగంశెట్టి లక్ష్మి, కొత్త నరసమ్మ, గ్రంధిశిల హనుమంతరావులతో పాటు మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు


విజేతలకు షీల్డ్స్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకట కోటయ్య, వెంకటేశ్వరరెడ్డి

పిడుగురాళ్ల: స్థానిక జూనియర్ కాలేజీ సమీపంలోని మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం నిర్వాహకులు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథిగా జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, మానసిక ఉల్లాసం సిద్ధిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డితోపాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

పశువిజ్ఞాన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో పాడిపోషకులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించినట్లు సెక్టారు పశువైద్యాధికారి రావెళ్ళ సురేష్ శుక్రవారం తెలిపారు. జీవాలకు ప్రతి 3 నెలలకొకసారి క్రమం తప్పకుండా నట్టల నివారణ మందును తాగించాలన్నారు.